క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం

నందిగామ: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జ్ వి.లక్ష్మీరాజ్యం అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో ఖాసిం అండ్ ఖాసిం వృద్ధాశ్రమంలో శనివారం సాయంత్రం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ వృద్ధుల కోసం ప్రత్యేక చట్టాలున్నాయన్నారు. అవసరమైతే వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు కమ్మినేని శోభారాణి, న్యాయవాదులు మట్టా ప్రసాద్, బొందలపాటి రామకృష్ణ, కే మల్లేశ్వరరావు, జి.వెంకటరత్నం, హనుమంతరావు, పలువురు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

గౌరవరం (జగ్గయ్యపేట): రైతులు విధిగా పంట నమోదు (ఈ క్రాప్) చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సి. భవాని పేర్కొన్నారు. గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నుంచి ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, 0 వడ్డీ పంట రుణాలు, ధాన్యం కొనుగోలు, వంటి వాటికి అర్హత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి వీపీఏ యుగంధర్, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హర్షం



బలుసుపాడు (జగ్గయ్యపేట): వైఎస్సార్ వాహన మిత్ర లబ్ధిదారులకు రూ.10 వేలు మంజూరు చేసిన సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీ యువ నాయకుడు వెంకటకృష్ణ ప్రసాద్ కొందరు ఆటో డ్రైవర్లు మర్యాద పూర్వం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాశరావు వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మారుతి రమేష్ బాల సైదులు పాల్గొన్నారు.

ఎంపీపీకి అరుదైన అవకాశం



పెనుగంచిప్రోలు: దేశరాజధాని ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రగతి మైదాన్ నుంచి శనివారం వర్చువల్‌గా నిర్వహించిన అభిలషణీయమైన బ్లాక్ పథకం ఆలోచన శిబిరంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఎంపీపీ మార్కపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని స్పీచ్ ఎంతో ఆకట్టుకుందని, ప్రభుత్వ పథకాలు, నిధులతో గ్రామాలను ఎలా అభివృద్ధి చేయాలో చక్కగా ఉదహరరించారన్నారు. బ్లాక్ కింద మండలాన్ని గుర్తించటం ఎంతో అదృష్టమన్నారు. తనతో పాటు ఎంపీడీఓ ప్రసాద్, గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు హాజరయ్యారన్నారు.

భూ సర్వేకు సహకరించాలి



జగ్గయ్యపేట: గ్రామాల్లో జరుగుతున్న వైయస్సార్ జగనన్న భుహక్కు భూ రక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూ సర్వే కు రైతులు సహకరించాలని తహసీల్దార్ చిన్నారావు పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం రావికంపాడు, బలుసుపాడు, అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. రైతులు పొలాల వద్దకు వచ్చే సర్వే అధికారులకు పూర్తిగా సహకరించాలన్నారు. హద్దులు, వివాదాలను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్, నాగరాజు, సర్వేయర్ సంతోష్, వీఆర్వో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బి.వసంతకుమార్ తెలిపారు. దర్గాపురం డాక్టర బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో రాబిన్ హుడ్ ఆర్మీ సౌజన్యంతో పిన్నమనేని సిద్ధార్థ డెంటల్ హాస్పిటల్ వైద్య సిబ్బందితో శనివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల దంతాల పరిరక్షణక తాము ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. తమకు సహకరించిన వైద్య సిబ్బంది, రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 200 మందికి ఉచితంగా దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు అజయ్, రత్నశ్రీ, రేణుక, సొసైటీ కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి గుర్రం ఏడుకొండలు, మాతృదేవోభవ వృద్ధాశ్రమం సిబ్బంది జ్ఞానేంద్ర పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం

- నియోజకవర్గాల్లో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- రోగులకు వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ
- ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేసిన కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు



చెవిటికల్లులో సురక్ష కిట్లును అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

చెవిటికల్లు(కంచికచర్ల): అందరికీ ఆరోగ్యం కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమని ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మండలంలోని చెవిటికల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ముంగిటకు మెరుగైన వైద్యం తీసుకురావడమే ప్రభుత్వం ఆశయమన్నారు. ముందస్తు ఆరోగ్య పరీక్షలతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం పెట్టవచ్చని తెలిపారు. ఈపథకం ద్వారా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. హెల్త్‌ప్రొఫైల్ మ్యాపింగ్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా, అవసరమైన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు పంపుతారన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రరావు, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచి బుడ్డి విజయలక్ష్మి, బండి మల్లికార్జునరావు, వెలగలేటి మాదవి, సొసైటీ అధ్యక్షుడు పుల్లారావు, ఎంపీడీవో బాలశంకరరావు, డాక్టర్ శ్రావణ్‌కుమార్, మధురిమ, తదితరులు పాల్గొన్నారు.

బలుసుపాడు(జగ్గయ్యపేట): మండంలోని బలుసుపాడు గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాన్ని శనివారం ఎంపీడీవో జె.రమేష్‌బాబు ప్రారంభించారు. సాయంత్రం వరకు రోగులు బారులుతీరారు. ఆరుగురు వైద్యులు బీపీ, షుగర్, పలు రకాల పరీక్షలను చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్పొరేట్ హాస్పటల్ తరహాలో ప్రత్యేకంగా తయారు చేసిన ఫైల్‌ను రోగులకు అందజేశారు. మొత్తం 280 మంది రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ యువనాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్, సర్పంచ్ యడ్లపల్లి సూర్యప్రకాష్, ఎంఈవో రవీంధర్, కార్యదర్శి శివాజీ, బూచవరం, జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రి వైద్యులు అనీల్‌కుమార్, శ్రవంతి, కీర్తిరెడ్డి, విజయకృష్ణ, హిమశ్రీ, విక్రమ సేతు, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సాయి, షాఉద్దిన్, బాలసైదులు, రమేష్, వలంటీర్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందదర్భంగా ఐసీడీఎస్, ఆరోగ్యశ్రీ, వైద్య ఆరోగ్య శాఖల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వేలో భాగంగా రోగులను పరీక్షించిన కేస్ సర్టిఫికెట్లను రోగులకు అందజేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మైనింగ్ కార్పొరేషన్ డైరక్టర్ బత్తుల రామారావు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చుంచు బెనర్జీ, ఉపసర్పంచ్ బాడిశ పాపారావు, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, సీడీపీఓ లక్ష్మీభార్గవి, మండల పరిషత్ కార్యాలయ ఏఓ సిద్ధారెడ్డి, వైద్యాధికారులు సుజన, ఇందిర, ఆరోగ్యశ్రీ కార్యక్రమం కో ఆర్డినేటర్ మోతిబాబు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రోగులకు కేస్ సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ నాగమణి, వెంకటకృష్ణ ప్రసాద్, తదితరులు



బలుసుపాడులో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న స్పెషలిస్ట్ వైద్యులు

నిరుపేదలకు మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): ప్రజలందరి ఆరోగ్య సంరక్షణే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో భాగంగా మహిళా సిబ్బంది ఆవరణలో పుష్పాలతో ప్రత్యేకంగా రంగవల్లులు వేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకీకరించి నిరుపేదలకు సైతం మెరుగైన వైద్య సదుపాయాలు అందిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాల హయాంలో నాణ్యమైన వైద్యం నిరుపేదలకు అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తీసుకురావటంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఇంటి వద్దనే మెరుగైన వైద్య సేవలందిస్తున్న మనసున్న ముఖ్యమంత్రి అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అవుల రమేష్ బాబు, వైద్యాధికారి గౌతమ్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోంద్రు బాయమ్మ, నాయకులు బెట్టంకొండ నాగేశ్వరరావు, మోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, పలువురు నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



రామిరెడ్డిపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు, డ్రైవర్లు

నందిగామ: అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా వాహన మిత్ర నిధులు విడుదల చేసిన నేపథ్యంలో శనివారం రాత్రి గ్రామంలోని సచివాలయం వద్ద సీఎం చిత్రపటానికి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. ఈ పథకం ద్వారా గ్రామానికి చెందిన 35 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమయ్యా యన్నారు. ప్రతి పేదవాడికి ఏదో ఒక లబ్ధి చేకూరేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

ఎక్సెల్ ప్లాంట్‌లో ఇన్ఫర్మేషన్ పార్క్ పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): అజిత్ సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్‌లో నిర్మాణంలో ఉన్న ఇన్ఫర్మేషన్ పార్క్‌ను శనివారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్లాంట్‌లో జరుగుతున్న ఆధునీకీకరణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను పరిశీలించి ఆడిటోరియంలోకి వెళ్లేది, వచ్చేది ఒకే ద్వారం ఉండటం ఇబ్బందిగా ఉంటుందని, మరో ద్వారాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పార్క్‌లో ఏర్పాటు చేసే గ్రీనరీని ఎప్పుడు వాడే గ్రీనరీ కాకుండా హెర్బల్, జోడైక్ గార్డెన్ సంబంధించిన గ్రీనరీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే గాజిబో ద్వారా ఏర్పాటు చేస్తున్న హట్‌ను మాములు బ్రిక్స్‌తో కాకుండా ప్లాస్టిక్ పెట్ బాటిల్స్‌తో బ్రిక్స్ నిర్మించాలని అధికారులకు ఆదేశించారు. పార్క్‌లో హోమ్ కంపోస్టింగ్ విధానాన్ని ప్రత్యక్షంగా చూడడానికి, చూసి నేర్చుకునే విధంగా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ ఇన్ఫర్మేషన్ పార్క్ పారిశుద్ధ్య కార్మికులకు అంకితం చేసే విధంగా కృషి చేస్తున్నామని కమిషనర్ అన్నారు. ఇన్ఫర్మేషన్ పార్క్ ముఖ్య ఉద్దేశం ఎక్సెల్ ప్లాంట్‌లో ఫ్లవర్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్ట్ ప్లాంట్, బయో మిథనేషన్ ప్లాంట్, ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మ్యానేజ్మెంట్ ప్లాంట్లు, మినీ సూయేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ట్రీ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, టౌన్ ప్లానింగ్ సెక్షన్ స్క్రాప్, స్క్రాప్ ప్లేసింగ్ యూనిట్, మాట్రెస్స్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్, సి–డి వేస్ట్ రీసైక్లింగ్ యూనిట్‌ల గురించి త్రి డీ పద్ధతిలో ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా దోమల నివారణ కోసం తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శనివారం బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఏకరూప దుస్తులు ధరించి జాతీయ జెండాలు చేతబూని బీఎస్ఎన్ఎల్ ఆకారంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా 4జీ సేవలు ప్రారంభిస్తుందన్నారు. విజయవాడ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్, సర్కిల్ కార్యాలయం ఉన్నత అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విస్తృత ప్రచారం

పటమట(విజయవాడతూర్పు): ఇండియా స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వంటి పలు అంశాలు నగర వాసులకు వివరించేందుకు వీఎంసీ మొబైల్ వ్యాన్లతో స్కీన్లతో విస్తృత ప్రచారం ప్రారంభించింది. ప్రచార వాహనాలను వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం ప్రధాన కార్యాలయంలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనోత్సవం



నిమజ్జనానికి తరలిపోతున్న గణనాథుడు



తొర్రగుంటపాలెంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్



పేటలోని ముక్త్యాల రోడ్‌లో పూజల్లో వైఎస్సార్ సీపీ నేత సామినేని ప్రశాంత్‌బాబు

నందిగామ: స్థానిక వాసవి మార్కెట్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనానికి తరలించారు. 13 రోజులపాటు స్వామి వారికి వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారి విగ్రహాన్ని ఉంచి కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సన్నాయి మేళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, కనక తప్పెట్ల మోతలు, బాణా సంచా మోతల నడుమ స్వామి వారు సందడిగా నిమజ్జనానికి తరలివెళ్లారు. సాయంత్రం ప్రారంభమైన ఊరేగింపు పట్టణంలోని వివిధ ప్రాంతాల గుండా సాగుతూ అర్ధ రాత్రి దాటే వరకు కొనసాగింది. కాగా స్వామి వారి లడ్డు వేలం పాట పోటా పోటీగా జరిగింది. ఈ నేపథ్యంలో ఓ భక్తుడు రూ.1.05 లక్షలకు స్వామివారి లడ్డూను సొంతం చేసుకున్నాడు. అదేవిధంగా పట్టణంలోని ముక్కోటి మండపంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని కూడా ఊరేగింపు అనంతరం నిమజ్జనానికి తరలించారు.

గణనాథులకు ప్రత్యేక పూజలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో శనివారం 13వ రోజున పలు వార్డుల్లో మండపాల్లో కొలువై ఉన్న గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్థానిక తొర్రగుంటపాలెం 10వ వీధిలో చత్రపతి శివాజి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలోని గణనాథుని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ సందర్శించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముక్త్యాల రోడ్‌లో డైనమిక్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని ప్రశాంత్‌బాబు దర్శించుకొని పూజలు చేశారు.

పనితీరు మార్చుకుని కౌన్సిల్‌కు పేరు తేవాలి



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్ర



సభలో మాట్లాడుతున్న పాలకవర్గ సభ్యులు వట్టెం మనోహర్

కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: అధికారులు పనితీరు మార్చుకుని కౌన్సిల్‌కు మంచి పేరు తేవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించే విషయమై బకాయిదారుడు కేవలం రూ.2,370 అద్దె కోసం కోర్టును ఆశ్రయించడం దారుణమని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. లీజును రద్దు చేసి మరలా వేలం పెట్టాలన్నారు. లీజు రద్దు చేస్తామంటే ఈ అంశంపై డిసెంట్ ఇస్తామని ప్రతిపక్ష సభ్యులు రామలక్ష్మి, సైదేశ్వరరావు అన్నారు. మున్సిపాలిటీకి ఆదాయం కోల్పోయినా పర్వాలేదన్నట్లు ప్రతిపక్ష నేతలు ప్రవర్తిస్తున్నారని ప్రభాకర్ అన్నారు. పాలకవర్గ సభ్యుడు వట్టెం మనోహర్ మాట్లాడుతూ కంట్రాక్టర్లు టెండర్లు వేసి 2, 3 నెలలు అయినప్పటికీ వార్డుల్లో పనులు ఎందుకు మొదలుపెట్టడం లేదని ఫైల్స్ కూడా ఎందుకు మిస్ అవుతున్నాయని ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ కొందరు అధికారుల తీరు వల్లే ఇలా జరుగుతుందని, కంట్రాక్టర్లు ఫైల్స్ ఎందుకు తీసుకెళుతున్నారని, అధికారులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. మనోహర్ మాట్లాడుతూ కౌన్సిల్ అంతా ఏకాభిప్రాయంతో తీర్మానం చేస్తూ ఈ మాఫియా ఆగడాలను అరికట్టాలని, విజయవాడ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. దీనిపై ప్రతిపక్ష సభ్యుల నుంచి కూడా సానుకూల స్పందన లభించింది. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ ఆగడాలపై ఒక విచారణాధికారితో విచారణ చేయిస్తామని తెలిపారు. లైట్ల విషయమై ప్రతిపక్ష సభ్యుడు పేరం సైదేశ్వరరావు మాట్లాడిన అంశంపై ప్రతిపక్ష సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు వేస్ట్, ఏమి చేయడం లేదని వారి వలన ఉపయోగం లేదన్నారు. దీనిపై మనోహర్, పందుల రోశయ్య మాట్లాడుతూ వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని, ఈ మాటలను వెనక్కు తీసుకోవాలన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై సభలో టీడీపీ సభ్యులు నల్లని కండువాలతో బైఠాయించి నిరసన వ్యక్తం చేయగా సభలో ఇలాంటి జిమ్మిక్స్ చేస్తూ కౌన్సిల్ సమావేశ సమయాన్ని వృథా చేస్తున్నారని అధికార సభ్యులు మండిపడ్డారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, సభ్యులు గింజుపల్లి వెంకట్రావు, సుందరమ్మ, కాశి అనురాధ, గీతారాణి, ఖాదర్‌బాబు, బషీరున్నీసా తదితరులు పలు సమస్యలను ప్రస్తావించారు. ఎజెండాలోని 58 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 8వ వార్డు సభ్యుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, ఇన్‌చార్జ్ కమిషనర్ డీఈ శివకోటేశ్వరరావు, అందరు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రేమ, సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తోటి వారికి సేవ చేయడం, తనను ద్వేషించే వారిని కూడా ప్రేమించే గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ బి.రాజేశ్వరరావు చెప్పారు. భారత్ వికాస్ పరిషత్ విజయవాడ, సెంట్రల్, ఈస్ట్ బ్రాంచ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో నగర స్థాయిలో దేశభక్తి గీతాల జాతీయ బృంద గాన పోటీలు శనివారం జరిగాయి. రాజేశ్వరరావు అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఈ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తోటి వారికి సహాయం చేసే గుణంతో పాటుగా ప్రేమించడాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే వార్తా పత్రికలు, గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. సెల్‌ఫోన్‌ను ఉపయోగించుకుంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఫోన్ చేసినంత మంచి ఎవ్వరూ చేయరని అన్నారు. ఫోన్ పట్టుకుని గేమ్స్ ఆడుకుంటూ, సోషల్ మీడియా చూస్తూ కూర్చుని సమయాన్ని వృథా చేసుకుంటే ఫోన్ అంత చెడ్డ వస్తువు మరేది లేదన్నారు. వివేకానంద జీవిత చరిత్రకు సంబంధించిన ప్రశ్నలను అడిగి విద్యార్థులతో ఆయన సమాధానాలను చెప్పించారు.

రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలు

భారత వికాస్ పరిషత్ నగర కమిటీ అధ్యక్షుడు ఎంవీఎస్ఎన్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి 1967వ సంవత్సరం నుంచి తమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం నగర స్థాయిలో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు రీజనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. హిందీ, సంస్కృతం, రీజనల్, జానపదం విభాగాల్లో విద్యార్థులు గీతాలను ఆలపించారు. భారత వికాస్ పరిషత్ సభ్యులు సురేష్ సొలంకి, సీహెచ్.రమేష్‌బాబు, ఏవీ.రమణ,సంతోష్, పి.వసంత్ కుమార్, ఎన్.జగదీష్, కె.గాంధీ, ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాల నిర్మూలన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బావాజీపేటలోని యువభవన్ నందు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం అనే అంశంపై సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మావతి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాల బారిన పడడడం నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యల్లో ఒకటిగా పేర్కొన్నారు. సినిమాల ప్రభావం యువత మత్తుకు బానిసవుతున్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా రోడ్డు ప్రమాదాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. జీవితాలు చిన్నా భిన్నం అవుతున్నాయని పేర్కొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ యు.సుబ్బారావు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, నిల్వ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటి వాటికి పాల్పడే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు.

పిల్లలకు విలువలు నేర్పించాలి..

నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ రత్నకుమార్ మాట్లాడుతూ మత్తు బానిసత్వం నుంచి యువతను విముక్తి చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ సువార్త మాట్లాడుతూ.. చిన్న వయసు నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విలువలు నేర్పించాలన్నారు. రాష్ట్ర మహిళా సంరక్షణ జనరల్ సెక్రటరీ డి.మధులత మాట్లాడుతూ మత్తు కు బానిసైన వారిని రక్షించటానికి నవజీవన్ బాల భవన్‌తో కలిసి పని చేస్తామన్నారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ శేఖర్ బాబు మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయట పడేసేందుకు డీ–ఎడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐర్లాండ్ డాన్ బాస్కో ప్రతినిధి టోనీ బ్రుక్, నవజీవన్ బలభవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ అంతయ్య, అడ్మినిస్ట్రేటర్ తంబీ, సెబ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్లు ఎస్‌కే నజ్మా, వసంత కుమారి, జాకబ్ రాజు, కె.ప్రియాంక, బి.రవి, బి.నెహేమియా, డి.రజిత, రాణి, హైమావతి పాల్గొన్నారు.